# మృగమానవి

అంతటి చలిలోనూ చంద్రికకు ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి, భయంతో వణికిపోతోంది. కానీ బుర్రమొద్దు బారిపోయింది. బుల్లిని కరుచుకుపోయింది. పరుగెత్తాలని పది అడుగులు ముందుకేసింది. కానీ భయంతో అక్కడే కూలబడిపోయింది.

నవంబరు నెల. చలిపులి పంజావిసిరి ఎముకల్ని కొరికేస్తోంది. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్‌లో వెడల్పాటి రోడ్లని, ఖరీదైన బిల్డింగ్స్‌ని ఆక్రమించుకొని మంచు ముత్యాల ముగ్గుల్ని వేస్తోంది. బుల్లి బిగుసుకుపోతున్నాడు.

పరుగెత్తిన చప్పుడు... దేనినో తన్నేసిన శబ్దం. తొట్రుపడింది చంద్రిక. బయట బాత్రూంతలుపు 'రపారపా!' మనికొట్టుకుంటోంది. కిటికీలోంచి బయటకు చూసింది.

ఒక్కసారి అవాక్కయి పోయింది. బయట చిరుతపులి. పిల్లి అంటేనే భయంతో వణికిపోయే చంద్రిక మొదటిసారి చిరుతపులిని చూస్తోంది. తను రెండేళ్ళ కొడుకు బుల్లితప్ప ఇంట్లో ఇంకెవరూ లేరు. బయటపులి కంగారుగా తిరుగుతోంది. బాత్రూం శ్లాబ్ పైకి ఎగిరింది. అటుగెంతింది. ఇటు తిరిగింది. గట్టిగా గాండ్రిస్తోంది.

వేసిన తలుపుగడియల్ని సరిచూసుకొంది చంద్రిక. నిద్రపోతున్న బుల్లి. బయట చిందులు తొక్కుతున్న చిరుత. చీకటి నీడలో చూడ్డానికి చాలా భయంగా ఉంది. ఆకలి పులిని అదిలించి వేస్తోంది.

నిద్రలో ఉండే కెవ్వుమన్నాడు బుల్లి. వాడినోటిని తన నోటితో నొక్కేసి కరుచుకు పోయింది. పాతకొంప వేసి ఉన్న తలుపుల గట్టితనం మీద నమ్మకం లేదు చంద్రికకు, తన అభద్రతా జీవితంలా. వరండాలో తచ్చాడి ప్రక్కనే ఉన్న బాత్రూంలోకి పోయింది చిరుతపులి. దాని ముఖంలో అసహనం, ఆయాసం, ఉద్వేగం.... కన్పిస్తున్నాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే జనారణ్యం నుండి వచ్చి, తరమబడి, తృటిలో తప్పించుకుని భయంతో కంపించి ఆపసోపాలు పడుతోంది.

భీకరారణ్యంలోంచి మన ప్రపంచంలోకి వచ్చిన చిరుత భయంతో దాక్కుంది.

ప్రక్క బిల్డింగ్ పై అంతస్తులోని లైట్ల వెలుగులు నలుదిశలా విస్తరించి ఉన్నాయి. ఈ రోజు పని పూర్తి చేయాలి. ముసలోడు ఊరి నుండి తిరిగి వస్తే అసలు కుదరదు.

గబ్బుచేస్తాడు!! ఇదే మంచి అదను తనలో తానే అనుకున్నాడు కూర్మరాజు.

రాత్రి కొట్టిన మందు దిగినట్లు లేదు. తనలోని మారు మనిషి ముందుకొస్తున్నాడు.

'ఆ కుర్ర కుంకని ఇప్పుడే వేసెయ్యాలి! ఎంత అన్న కొడుకయితే మాత్రం, తనకేంటి? వాడిని బ్రతకనిస్తే తన కొడుకుతో బాటు ఆస్తిలో వాడికి వాటా.'

చంద్రిక తనకు వదిన గారైనా ఆడది ఏం చేయగలదు? చచ్చిన కొడుకును, తలచుకుంటూ ఎప్పుడో తనూ ఛస్తుంది.

కూర్మరాజు చేతిలోని సిగరెట్ మండుతోంది అతని ఆలోచనల్లా!

చిక్కటి చీకటి తెరల మధ్యలో గుండెల్లో వెచ్చదనం. మరో యమ్ పెగ్గు తీసుకున్నాడు. చాల మత్తుగా అన్పించింది.

'బుల్లిగాడిని చంపేదెలా? పీక పిసిగా డాబాపై నుండి క్రిందకు నెట్టేశా, మరి విసిరేశా... ఊరు వెళ్లిన తనముసలి తిరిగివచ్చే లోగా వాడు చావాలి! లోకం దృష్టిలో ఎవరికీ అనుమానం రాని మిస్టరీ కావాలి!

మరో పెగ్గు కిక్కును పెంచుకుంటూ పోతోంది. టైము చూసుకున్నాడు. పూర్తిగా వెలుతురు రావడానికి మరో అరగంట పట్టొచ్చు. ప్రక్క సొరుగులోని హాండ్‌గ్లౌవ్స్ తీసుకున్నాడు.

లైట్స్ ఆఫ్ చేశాడు.

❖ ❖ ❖

తలుపు తట్టిన శబ్దం. భయపడుతూనే కిటికీలోంచి బయటకు చూసింది చంద్రిక. ఎదురుగా కూర్మరాజు. మరిదిని చూసేసరికి ప్రాణం లేచివచ్చింది. వణుకుతూనే తలుపు తీసింది. వెలుగుతూన్న సిగరెట్‌ని విసిరేసి లోపలికి అడుగువేశాడు.

వణికిపోతోంది చంద్రిక. చేతిలోని బుల్లి నలిగి ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. అదోలా నవ్వబోయాడు కూర్మరాజు. అది చాల కృతకంగా ఉంది.

అదీ.. అక్కడ... నిలువెల్లా వణికిపోతూ అటుగా చేతులు చూపిస్తోంది. కూర్మరాజు నవ్వు వికృతంగా మారుతోంది. తడిసి ముద్దయిన చంద్రిక చేతిలోని తన ప్రాణాన్ని... అదే బుల్లిని మరిదికి అందించింది.

కుట్రాకుతంత్రం తెలియని చంద్రికకు ఆ క్షణంలో కూర్మరాజు ఆపద్బాంధవుడుగా అన్పించాడు. బుల్లిని లాక్కుని రెండు అడుగులు బయటకు వేశాడు కూర్మరాజు.

చిన్నాన్న చేష్టలకు కెవ్వుమంటున్నాడు బుల్లి. చంటాడిని పట్టుకొని తిడుతున్నాడు. కొడుతున్నాడు. చేతుల్ని వెనక్కి విరిచి పట్టి నానా హింసా పెడుతున్నాడు.

బాత్రూంలో నక్కిన మృగానికి అన్నీ అవగతమవుతున్నాయి. ఎదురుగా ఉన్న మానవ మృగాన్ని చూస్తుంటే వింతగా అన్పిస్తోంది. తరముకొస్తున్న వారిని తప్పించుకొని పారిపోయి వచ్చిన వైనం.. ఓ ప్రక్క ప్రాణభయం దాన్ని నిలువ నీయడంలేదు. అతలాకుతలం చేస్తున్న.. అసహనం... ముక్కుపచ్చలారని పసివాడిపై అమానుష దాడి మొదలైన అంశాలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

ఇవేమీ తెలియని కూర్మరాజులో వచ్చిన పనిని త్వరగా ముగించాలన్న ఆత్రుత కన్పిస్తోంది. ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు చంద్రికకు. లోపలికి రమ్మని అరుస్తోంది. కూర్మరాజుకు ఆ మాటలు పట్టడంలేదు. తన కోరిక నెరవేరబోతున్నందుకు ఆనందంగా ఉంది.

బుల్లి పీక ఆ రాక్షసుడి కబంధహస్తాల మధ్య నలిగిపోతోంది. కూర్మరాజులో ఆత్రుత... చంద్రికలో మరో ఆత్రుత.. చిత్రంగా చూస్తోంది చిరుత. బుల్లి పెట్టే కేకలు ఎక్కువవుతున్నాయి. కొన్ని గంటలుగా పడిన కష్టం... తృటిలో తప్పించుకొని నక్కిన వైనం కంటి ముందు కదలాడుతున్నాయి.

కూర్మరాజులోని మారుమనిషి దగ్గరలోని గాండ్రింపుల్ని, కేకల్ని విన్పించుకొనే స్థితిలో లేడు. కోపంతో ఊగిపోతున్నాడు. లేకపోతే తమ మొత్తం ఆస్తికి వారసుడు కావాల్సిన తనకొడుక్కి రేపు మరొకడు వాటాకి వస్తాడా!

నిజమైన మృగం కూర్మరాజులో కన్పిస్తోంది. కొన్ని అడుగుల దూరంలోని క్రూరమృగం చటుక్కున లేచింది. తలవిదిలించింది. పెద్దగా అలికిడిచేస్తూ ఒక్కసారిగా మీదకు దుమికింది.

అనుకోని పరిణామానికి హతాశుడైపోయాడు. ఆ షాక్‌కి చేతిలోని బుల్లిని దూరంగా

విసిరేశాడు. విసిరిన పంజాతో కూర్మరాజుని ఈడ్చుకుంటూ పోయింది. పెద్దగా అరుస్తున్నాడు. ఆ అరుపుల శబ్దం నెమ్మదిగా సన్నగిల్లుతోంది. క్రమంగా నిశ్శబ్దం.

కిందపడి ఏడుస్తున్న బుల్లిని అక్కున చేర్చుకొని తటాలున తలుపులు మూసింది చంద్రిక.

అంతలో రోడ్డుమీద కోలాహలం. జూ అధికారులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు గుమికూడి ఉన్నారు. వింతను చూద్దామని కొందరు.. భయాందోళనలతో మరికొందరు.

ఒక్కసారి తుపాకి పేలిన శబ్దం. ఆ మత్తు తూటాకి 'జూ' అధికారులకి బందీ అయిపోయింది చిరుతపులి. కొంచెం తెప్పరిల్లింది చంద్రిక. కొడుక్కి ఏమీ కాలేదని నిర్ధారించుకున్న తర్వాత గాని ప్రాణం కుదుటపడలేదు.

బయట మృగాన్ని బోనులోకి ఎక్కిస్తున్నారు.

అయిష్టంగానే బందీ అవుతోంది పులి. ఏమనుకుందో ఏమో ఒక్కసారి వెనక్కి తిరిగింది.

ఆ నీలికళ్ళు వింతగా మెరుస్తున్నాయి. నిండిన నీళ్ళలో ఆ నీలిరంగు మరింత మెరుపుల్ని సంతరించుకుంటోంది. తనలాగే వంచింపబడుతున్న మరొకరికి కొంతమేలు చేశానన్న మృగనీతి కన్పిస్తోంది ఆ ముఖంలో.

ఈసారి ఆ దృశ్యం చంద్రికకు భయాన్ని కల్గించకపోగా ఎంతో కొంత ఆత్మీయతను పెంచింది.

అప్రయత్నంగా చంద్రిక రెండు చేతులు దగ్గరయ్యాయి.

**(భావతరంగిణి మాసపత్రిక కథల పోటీలలోలో బహుమతి పొందిన కథ)**